ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండో విడత రుణమాఫీలో లబ్ధి పొందిన రైతుల వివరాలు

జిల్లా	రైతులు	డబ్బులు (రూ.కోట్లలో)
వనపర్తి	16,527	154.58
నాగర్‌కర్నూల్	30,501	297
నారాయణపేట	18,496	181.83
జోగుళాంబ గద్వాల	18,141	174.73
మహబూబ్‌నగర్	21,589	215.44
మొత్తం	1,05,254	1,023.58



బండ్ల యూటర్న్

- 24 రోజుల్లోనే తిరిగి బీఆర్‌ఎస్ గూటికి చేరిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- సరితకు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యతే కారణమనే ప్రచారం
- పూర్తి బాధ్యతలు అప్పగించకపోవడం.. గుర్తింపు లేకపోవడమూ కారణమే..
- అనుచర వర్గాన్ని కాపాడుకునేందుకు గతంలోనూ జిద్దుగా ఎమ్మెల్యే శైలి
- కోర్టు కేసు, అనర్హత పిటిషన్‌తోనూ వెనుకడుగు
- ఉమ్మడి పాలమూరులో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ ఆశలకు బ్రేకులు



కృష్ణమోహన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి యూటర్న్ తీసుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన 24 రోజుల్లోనే తిరిగి బీఆర్‌ఎస్‌లో కొనసాగనున్నట్లు ప్రకటించి.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారారు. దీంతో పాలమూరులో క్లీన్‌స్వీప్ దిశగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆశలకు బ్రేకులు పడ్డట్లయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హస్తంగాలి వీయగా.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని రెండు స్థానాలను మాత్రం బీఆర్‌ఎస్ తిరిగి కైవసం చేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే చర్చ ప్రారంభం నుంచే జరుగుతోంది. అనుకున్నట్లుగానే రెండోసారి గెలిచిన సుమారు ఏడు నెలల తర్వాత గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చేరడమే తరువాయి అన్నట్లుంది పరిస్థితి. ఇప్పటికే చల్లా ఒకసారి రేవంత్‌రెడ్డితో సమావేశమై చర్చించగా.. అప్పుడే పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. అయితే ఆషాఢం తర్వాత చేరాలని నిర్ణయం తీసుకోవడంతో వాయిదా వేశారని చర్చ జరిగింది. ఆయన కూడా చేరితే క్లీన్ స్వీప్ అవుతుందని ఆశిస్తున్న వేళ.. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఊహించని షాక్ ఇచ్చారు. ఆయన చేరిక సమయంలో కూడా గద్వాలతోపాటు గాంధీ భవన్ వద్ద తీవ్ర హైడ్రామా జరిగింది. కాంగ్రెస్ గద్వాల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన సరిత వర్గీయులు ఆత్మహత్యాయత్నాలు, నిరసనలు, ధర్నాలు చేసి.. బండ్ల చేరికను వ్యతిరేకించారు. అయినప్పటికీ చేరిక జరిగిపోయింది. కానీ ఇప్పుడు అనూహ్య పరిణామంతో రాజకీయాలు సంచలనంగా మారాయి. ఎందుకు తిరిగి చేరారు? ఏం జరిగింది? మళ్లీ బీఆర్‌ఎస్‌కు జవసత్వాలు వస్తాయా? అనే విషయంలో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

ఆది నుంచీ జిద్దుగానే..

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 2018లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా.. ఇటీవలి ఎన్నికల్లో రెండోసారి ఎన్నికయ్యారు. పదేళ్లు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటంతో గద్వాల నియోజకవర్గంలో తన అనుచరవర్గాన్ని కాపాడుకుంటూ.. పనులు చేస్తూ వస్తున్నారు. నియోజవర్గంలో అధికార వ్యవస్థ అంతా ఆయన కేంద్రంగా కొనసాగింది. సరిత జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికైన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు చెలరేగాయి. పార్టీలో పలువురి మద్దతు సరితకు ఉన్నా.. ఎమ్మెల్యే కేంద్రంగా రాజకీయాలు నడవడటంతో పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. ఒకసారి జడ్పీ సీఈవో బదిలీ విషయంలో తన సూచనలను పట్టించుకోలేదని బండ్ల ఏకంగా తనకు కేటాయించిన గన్‌మెన్‌లను వాపస్ పంపించి.. మరీ పంతం నెగ్గించుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచినప్పటికీ.. కాంగ్రెస్ అధికారంలో రావడం, అప్పటికే జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కేంద్రంగా రాజకీయాలు, అధికార వ్యవస్థ కేంద్రీకృతం కావడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ సరైన గుర్తింపు రావడం లేదని, అధికారుల విషయంలో తను చెప్పిన మార్పులను కూడా పట్టించుకోవడం లేదనే అసంతృప్తి కృష్ణమోహన్‌రెడ్డిలో నెలకొందని తెలుస్తోంది. పైగా తన అనుచరవర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్న ఆయనకు గుర్తింపు లేకపోవడం నిరాశకు గురి చేసింది. ఇటీవల ఎన్‌డీఎస్‌పీ కేసులు నమోదు కావడం కూడా ఆయన్ను కలిచివేసిందని సమాచారం. అలాగే పార్టీలో సరితకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వంటి క్రియాశీలక పదవి వస్తుందనే ప్రచారం సాగుతుండటంతో ఇంకా ఇబ్బంది అవుతుందని ఎమ్మెల్యే భావించినట్లు తెలుస్తోంది. పలు సందర్భాల్లో మంత్రి జూపల్లి వద్ద విషయాలు ప్రస్తావించినప్పటికీ సరైన ఊరట లభించలేదని.. ఆ నేపథ్యంలోనే ఘర్ వాపసీ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే సెంట్రిక్‌గా ఉన్న పాలిటిక్స్‌ను చూడగా.. ఇప్పుడు ఇద్దరి మధ్య అధికార విభజన మింగుడు పడలేదని తెలుస్తోంది.

కోర్టు కేసా.. అనర్హత పిటిషనా?

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదంటూ గత ప్రభుత్వంలో ప్రస్తుత పాలమూరు ఎంపీ డీకే అరుణ కోర్టులో కేసు వేయగా.. పదవీకాలం చివరిలో కోర్టు అనర్హత వేటు వేసి, ఎక్స్ పార్టీ తీర్పును ఇచ్చింది. దానిపై కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం, మళ్లీ గెలవడం జరిగిపోయాయి. గడిచిన ఎన్నికలకు సంబంధించి బండ్ల గెలుపును సవాల్ చేస్తూ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ తరఫున లాయర్ వాదనలు వినిపించగా.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన తర్వాత లాయర్‌ను పార్టీ విత్‌డ్రా చేసుకుంది. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు పార్టీ మారుతుండటంతో బీఆర్‌ఎస్ అప్రమత్తమైంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. గతంలో బీఆర్‌ఎస్ కూడా ఈ విధానాన్ని అవలంబించినప్పటికీ.. 2/3 సభ్యులు పార్టీలో చేరినందున దాన్ని విలీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అయితే ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వారిలో 2/3 ఇంకా కాంగ్రెస్‌లో చేరలేదు. ఈ కారణంగా అనర్హత వేటు వేసే అవకాశమున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధులు ఒక పార్టీ ద్వారా గెలిచి.. మరో పార్టీలో చేరితే అనర్హత వేటు విషయంలో సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు కారణాల నేపథ్యంలోనే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్‌ఎస్ గూటికి చేరినట్లు సమాచారం. ఈ విషయంపై ఎమ్మెల్యేను సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో రైతులకు రుణమాఫీ చెక్కును అందిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

రూ.1,023 కోట్లు మాఫీ

- రెండో విడత రుణమాఫీ నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1,05,254 మంది రైతులకు లబ్ధి
- కలెక్టరేట్‌లలో వీసీ ద్వారా సీఎం సందేశాన్ని విన్న అధికారులు
- అర్హులైన రైతులకు చెక్కులు అందజేత

నాగర్‌కర్నూల్/వనపర్తి రాజీవ్ చౌరస్తా/నారాయణపేట టౌన్/గద్వాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండో విడత రుణమాఫీలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 1,05,254 మంది రైతులకు రూ.1,023.58 కోట్ల మాఫీ జరిగింది. హైదరాబాద్‌లోని అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, జిల్లాల్లోని కలెక్టరేట్‌లలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులు సీఎం సందేశాన్ని విన్నారు. అనంతరం ఎంపిక చేసిన రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు. ఆ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో లక్ష వరకు రుణమాఫీ చేయగా, రెండో విడతలో లక్షా 50 వేల లోపు రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వం మాఫీ చేసింది. ఇక మూడో విడత రూ.రెండు లక్షల రుణమాఫీని వచ్చే నెల 15వ తేదీ లోపు చేస్తామని ప్రకటించడంతో రూ. రెండు లక్షల రుణం తీసుకున్న రైతులు ఎదురు చూస్తున్నారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని 16,527 మంది రైతులకు రూ.154.58 కోట్లు రుణమాఫీ నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణమాఫీ కోసం 27,066 మంది రైతుల ఖాతాల్లో రూ.145.55 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో వివిధ కారణాల వల్ల 1140 మంది రైతులకు రుణమాఫీ జరుగలేదని, త్వరలోనే సమస్యను పరిష్కరించి వారి ఖాతాల్లోనూ నగదు జమ చేస్తామన్నారు. రెండో విడతలోనూ ఎవరికైనా మాఫీ కాకుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08545-220351కు లేదా 08545-233525కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, ప్యాక్స్ చైర్మన్లు, బ్యాంకర్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ రుణాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి విడతలో 35,108 మంది రైతు కుటుంబాలకు రూ.194.47 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, రెండో విడతలో 21,589 మందికి రూ.215.44 కోట్లు రుణమాఫీ చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు ఆమె చెక్కులను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. రుణమాఫీ అయిన రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇచ్చి, పంట పెట్టుబడికి సహకరించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. రుణమాఫీ కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశమయ్యారు. రుణమాఫీ అయిన ఖాతాల రెన్యూవల్ మందకొడిగా ఉందని, వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్‌రావు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎల్‌డీఎం కాల్వ భాస్కర్, ఆర్‌డీవో నర్సింహులు, బ్యాంక్ అధికారులు నర్మద, రవికిషోర్ రెడ్డి, మురళీకృష్ణ, ప్రసాద్ పాత్రో, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన రైతుకు ప్రయోజనం చేకూరాలి

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ మొదటి విడతలో 46,780 మంది రైతు కుటుంబాలకు రూ.265 కోట్లు మేర లబ్ధి చేకూరగా, మలి విడతలో 30,501 మంది రైతు కుటుంబాలకు రూ.297 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 77,281 మంది రైతులకు రూ.562 కోట్ల మేర లబ్ధి జరిగిందన్నారు. పలువురు రైతులకు రుణమాఫీ చెక్కులను లాంఛనంగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీతో అర్హులైన రైతులందరికీ ప్రయోజనం చేకూరాలన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, నాగర్‌కర్నూల్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూపాల్‌రావు, రంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎస్‌బీఐ నాగర్‌కర్నూల్ మేనేజర్ గురుప్రసాద్, ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ రంజిత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో జమ చేయాలి

రుణమాఫీలో భాగంగా నారాయణపేట జిల్లాకు మొదటి విడతలో 28,684 మంది రైతుల ఖాతాల్లో రూ.165.45 కోట్లు జమ చేయగా, రెండో విడతలో 18,496 మంది రైతులకు రూ.181.83 కోట్లు ప్రభుత్వం నుంచి వచ్చాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్, వ్యవసాయ అధికారులు రుణమాఫీ డబ్బులు రైతులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ పాల్గొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండో విడతలో రుణమాఫీ కింద 18,141 మంది రైతులకు రూ.174.73 కోట్లు మాఫీ అయ్యాయి. కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందనాయక్ రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు. మొదటి విడతలో 24,398 మంది రైతులకు రూ.144.09 కోట్లు మాఫీ అయ్యాయి.

సందర్శకుల తాకిడి




శ్రీశైలం పది గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్టుకు సందర్శకుల సందడి అధికమైంది. మంగళవారం రెండో రోజు రాత్రి డ్యాం పది గేట్లను అధికారులు ఎత్తారు. డ్యాం అందాలను తిలకించడానికి తెలంగాణతో పాటు.. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రాజెక్టును చూసి, భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్నారు.

\- దోమలపెంట



ఫొటోలు దిగుతున్న సందర్శకులు



నిండుకుండలా శ్రీశైలం ప్రాజెక్టు



ప్రాజెక్టు అందాలను చూస్తున్న యువకులు



సెల్ఫీ పాయింట్ వద్ద సందర్శకులు

వ్యర్థాల వేలం

ఉన్నాట్టా? లేనట్టా?



చికెన్, చేపల వ్యర్థాల తరలింపు వాహనం

- బహిరంగ టెండర్ వేయకుండానే వ్యర్థాల తరలింపు
- 11 దరఖాస్తులు వచ్చినా నిర్వహించని టెంటర్ ప్రక్రియ
- రాజకీయాల వల్ల రూ.లక్షల ఆదాయం ఆవిరి
- లోపాయికారి ఒప్పందంతో ఒక వర్గానికే వ్యర్థాల తరలింపు అవకాశం

వనపర్తి టౌన్, జూలై 30: మునిసిపాలిటీకి అత్యధికంగా ఆదాయాన్ని ఇచ్చే చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు టెండర్ ప్రక్రియ ఎందుకు నిర్వహించడంలేదో వనపర్తిలో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. పురపాలికలో ఈ ఏడాది బహిరంగ వేలం నిర్వహించడం కోసం అధికారులు ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారం చేశారు. వారపు సంత, జంతువధశాల, వ్యర్థాల తరలింపు కోసం దరఖాస్తులు వచ్చాయి. ఒక్క లైబజార్ కోసం మాత్రం ఎలాంటి దరఖాస్తులు రాలేదు. దీంతో వారపు సంత, జంతువధశాల బహిరంగ వేలాన్ని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. దరఖాస్తులు వచ్చినా వ్యర్థాల తరలింపు కోసం బహిరంగ టెండర్ ఎందుకు నిర్వహించడం లేదో ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. వ్యర్థాల తరలింపునకు టెండర్ నిర్వహించని కారణంగా మునిసిపాలిటీ ఆదాయం రూ.లక్షల్లో ఆవిరి అవుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

రాజకీయ ఒత్తిడే కారణమా?

చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు బహిరంగ టెండర్ నిర్వహించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు

గ్రుపులుగా మారి..

ఓ సామాజిక వర్గానికి చెందిన వారు నాలుగు గ్రుపులుగా ఏర్పాడి చికెన్, చేపల వ్యర్థాల తరలింపునకు బహిరంగ టెండర్ నిర్వహించవద్దని మునిసిపల్ కార్యాలయం ముందు ఇటీవల ధర్నా నిర్వహించారు. రూ.లక్షల ఆదాయం చవిచూసిన ఆ వర్గం సభ్యుల్లో ఒకరు గత ఏడాది తరలింపు దక్కించుకున్నారు. కాలపరిమితి ముగిసినా.. కొత్తగా టెండర్ నిర్వహించలేదని వ్యర్థాల తరలింపును యాధావిధిగా కొనసాగిస్తున్నాడు. దీంతో వారిలోనే మరి కొందరు వ్యక్తులు అధికారులు, పాలకులను మచ్చిక చేసుకుని వ్యర్థాల తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. మళ్లీ అధికారుల లోపాయికారి ఆదేశాలతో అడ్డుకున్న వ్యక్తులే ఎలాంటి టెండర్ హక్కు పత్రాలు లేకుండానే స్వంతంగా చికెన్, చేపల వ్యర్థాలను తరలించడం కొసమెరుపుగా మారింది. ఈ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారి, పోలీస్ స్టేషన్ వరకు పాకడంతో గోప్యంగా కొనసాగుతున్న వ్యవహారం బట్టబయలు అయ్యింది.



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

చికెన్, చేపల వ్యర్థాల తరలింపు కొనసాగిస్తున్నారు. ఇదే తరుణంలో గత ఏడాది ఎలాంటి బహిరంగ టెండర్ నిర్వహించకుండానే లోపాయికారి ఒప్పందంతో ఆనాటి పాలకులు వ్యర్థాల తరలింపును కొందరికి గుట్టుగా కట్టబెట్టారు. ఆ ఒప్పందానికి ఇటీవలే కాలం ముగిసింది. గత కొన్ని నెలల క్రితం కొలువుదీరిన పాలకవర్గం అయినా ఈ సారి బహిరంగ వేలం నిర్వహిస్తుందని అందరూ ఊహించారు. కానీ కొత్తగా కొలువుదీరిన పాలకులు సైతం పాత పద్ధతినే కొనసాగిస్తుండటంతో మునిసిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది.

ఉల్పరలో రైతు ఆత్మహత్యాయత్నం

- భూ వివాదమే కారణం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు వెంకటేష్

వంగూరు, జూలై 30 : నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలంలోని ఉల్పరలో మంగళవారం రైతు క్యామ వెంకటేష్ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పర శివారులోని సర్వే నెంబర్ 60లో గల 2 ఎకరాల 8 కుంటల భూమి విషయంలో కొండారెడ్డిపల్లికి చెందిన సుజీవన్‌రెడ్డి, ఉల్పరకు చెందిన రైతు వెంకటేష్ మధ్య కొంత కాలంగా కోర్టులో కేసు నడుస్తోంది. 2016 నుంచి ఈ భూమిపై తరచూ వారిమధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సుజీవన్‌రెడ్డి రెండు ట్రాక్టర్లను తీసుకొని వచ్చి వివాదంలోని భూమిని దున్నుతుండగా డయల్ 100 కు వెంకటేష్ ఫోన్ చేశాడు. వెంటనే ఇద్దరు పోలీసులు వెంకటేష్ ఇంటికి వచ్చి ఎస్‌ఐ రమ్మన్నారని చెప్పారు. ఇంతలోనే వెంకటేష్ తన ఇంట్లోకెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ ఘటనను గమనించిన కుటుంబ సభ్యులు కల్వకుర్తి దగ్గర గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇదివరకే తమపై అక్రమంగా ఎస్‌సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి పోలీసులు తీవ్రంగా కొట్టారని, ఇప్పుడు తీసుకెళ్లి మళ్లీ దాడి చేస్తారనే భయంతో వెంకటేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని బాధితుడి సోదరుడు శ్రీనివాసులు తెలిపాడు.

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి

వంగూరు, జూలై 30: వరి నాటేందుకు ట్రాక్టర్‌తో కరిగెట చేస్తుండగా దాని కింద పడి రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరుకు చెందిన రైతు కొమ్ము లక్ష్మయ్య(75) తన పొలంలో వరి నాటేందుకు ట్రాక్టర్‌తో కరిగెట దున్నుతున్నాడు. ట్రాక్టర్ ఆగిపోవడంతో కిందకు దిగి నాగళ్లకు పట్టుకున్న బురదను తొలగించాడు. తర్వాత మళ్లీ ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. వాహనం బురదలో ఇరుక్కు పోవడంతో బాగా రేజ్ చేశాడు. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. లక్ష్మయ్య ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వేచ్ఛ కోసమే ఫణంగా పాలస్తీనియన్ల ప్రాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాఘవాచారి

పాలమూరు, జూలై 30 : పాలస్తీనా ప్రజలు స్వేచ్ఛగా బతకాలనే ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఎస్ఎం ఖలీల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, సామాజికవేత్త ఎండీ హనీఫ్, ఉర్దూ కవి బాబర్‌షస్త్రక్, సలీం, కె.శ్రీదేవి వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఇజ్రాయెల్ దేశం ఉనికిలో లేదని, పాలస్తీనా పౌరుల దయతో యూదులకు నివాసం కోసం అవకాశం ఇస్తే నేడు పాలస్తీనాను ఆక్రమించుకునేందుకు దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను శక్తివంచన లేకుండా పాలస్తీనీయులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తల్లుల ముందు పిల్లలు, పిల్లల ఎదుట తల్లులు మరణిస్తున్న సంఘటనలు పాలస్తీనా ప్రాంతంలో చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పోరాటానికి ప్రతీఒక్కరు సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పి.విజయ్‌కుమార్, టీపీఎఫ్ బుచ్చారెడ్డి, శ్రీదేవి, మౌలానా ఇస్మాయిల్, సలీం, రహీం, మిర్జా సోయబ్ అలీ, స్వేపర్ల సంఘం అధ్యక్షుడు జి.గట్టన్న, జలాల్‌పాషా, అబ్దుల్‌అజీజ్, బోయ కృష్ణ, సికందర్, అజీజ్, అబ్బాస్, రఫీ, గులాం, ముస్తాజ్‌ఇమామ్, రహమాన్ పాల్గొన్నారు.

పాన్‌గల్ ఎస్ఐ ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్

పాన్‌గల్/నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 30 : పాన్‌గల్ ఎస్సై కల్యాణ్‌రావును జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ మంగళవారం నాగర్‌కర్నూల్ ఎస్పీ రావుల గిరిధర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం రాత్రి తన వాహనానికి అడ్డు వచ్చాడని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ దుకాణం యజమానిపై ఎస్సై దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఎస్సైపై విచారణకు మల్టీజోన్ ఐజీ జిల్లా ఎస్పీని విచారణకు నియమించినట్లు సమాచారం.

రంజిత్ అనే వ్యక్తి మద్యం తాగి ఉండి తన వాహనాన్ని తగిలించాడనే నెపంతో ఎస్సై అతనిపై చేయి చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్పీ పేర్కొన్నారు. సీసీఏ ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

కందనూలుకు గడ్డుకాలమే..

- ఏడాదికేడాదికి తగ్గుతున్న వర్షపాతం
- జిల్లాలో నిండని చెరువులు, కుంటలు
- ఎగువన కురుస్తున్న వర్షాలతోనే ప్రాజెక్టులు సస్యశ్యామలం

అచ్చంపేట, జూలై 30 : వానాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా కందనూలు జిల్లాలో పూర్తి స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో జిల్లాలోని 1994 చెరువుకుంటలు నీరు లేక వెలవెలపోతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తుంటే జిల్లాలో మాత్రం తుంపర వర్షాలే దిక్కయ్యాయి. ఇప్పటివరకు జూన్ నెలలో 137.4 మి.మీ. వర్షపాతం నమోదు కావల్సి ఉండగా 76.2 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెలలో 135.1 మి.మీ.కు గాను ఇప్పటివరకు 124.1 మి.మీ. మాత్రమే నమోదైనట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 579 చెరువుకుంటలకు నీరు చేరే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 1415 చెరువుకుంటలకు వర్షాధారమే దిక్కు. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జిల్లాలోని జొన్నలబొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లు నిండుకుండలా మారాయి. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వల ద్వారా జిల్లాలోని చెరువుకుంటలకు నీరు చేరుతోంది. వర్షాకాలం మరో రెండునెలలు ఉండడంతో మిగిలిన చెరువు, కుంటలకు నీరు చేరుతుందా, లేదా అన్న అనుమానం లేకపోలేదు.


కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నిండిన డిండి ప్రాజెక్టు (ఫైల్)

జిల్లాలో వంద ఎకరాలకు పైగా సాగు అయ్యే చెరువులు 139 ఉంటే, వందలోపు సాగు అయ్యే చెరువు, కుంటలు 1855 ఉన్నట్లు డీఈఈ బాబుచంద్ తెలిపారు.

కేఎల్ఐతోనే చెరువు కుంటలకు మోక్షం

జిల్లాలో 1994 చెరువులు, కుంటలుండగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 579 చెరువు కుంటలకు నీరు చేరుతోంది. గత రెండు, మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులకు జిల్లాలో కురిసిన వర్షాలతో పూర్తి స్థాయిలో చెరువులు, కుంటలు నిండిన దాఖలాలు లేవు. ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ప్రవహిస్తూ జిల్లాలోని చెరువు, కుంటలకు ఆధారమైంది.

భారీ వర్షాలు నమోదు కావడం లేదు..



గత రెండు, మూడేళ్లుగా జిల్లాలో సరైన వర్షాలు కురువడం లేదు. ఎగువన కురుస్తున్న వర్షాలతోనే కృష్ణానది పారుతోంది. ఆ నీరే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువు, కుంటలకు ఆధారమవుతోంది. ఇంకా పూర్తి స్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడితే జిల్లా సస్యశామలం అవుతుంది. ఏడాదికేడాదికి వర్షాలు తగ్గుతున్నాయే తప్ప పెరగడం లేదు.

- నారాయణ, బల్మూరు మండల మాజీ వైస్ ఎంపీపీ

రూ.29.25లక్షల నగదు రికవరీ

- ఆర్టీసీ బస్సులో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్
- కేసు ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బందికి రివార్డు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

జడ్చర్ల, జూలై 30 : ఆర్టీసీ బస్సులో రూ.36లక్షల నగదు చోరీ అయిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి, రూ.29.25లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడించారు. సీసీ కెమెరాలు, టెక్నాలజీ ఉపయోగించి కేసును పరిశోధించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. మరో నిందితుడికి నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులపై 2008లో అఫ్జల్‌గంజ్‌లో ఇలాంటి కేసులే నమోదైనట్లు చెప్పారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసును ఛేదించిన తీరుతో పాటు, పట్టుబడిన నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 16న హైదరాబాద్‌కు చెందిన టీఎస్ ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న పాలచెర్ల దామోదర్ అనే వ్యక్తి రూ.36లక్షలను బ్యాగులో పెట్టుకుని, హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి కర్నూల్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. తన వెంట ఉన్న బ్యాగును సీటుపై భాగాన ఉండే స్టాండుపై పెట్టాడు. అదే బస్సులో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బిజ్నూర్ పట్టణానికి చెందిన షారూఖ్, అబ్దుల్‌సత్తార్, బిజ్నూర్ జిల్లా అఫ్జల్‌ఘడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మనియావాలా గ్రామానికి చెందిన షేక్ దిల్షాద్ అహ్మద్‌లు ఎక్కారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల మార్గం మధ్యలో బ్యాగులో ఉన్న డబ్బును మరో బ్యాగులోకి మార్చుకుని, ఆ బ్యాగులో నీళ్ల బాటిల్స్ పెట్టారు. అనంతరం జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద షారూఖ్, షేక్‌దిల్షాద్ అహ్మద్ బస్సులో నుంచి దిగారు. అదే బస్సులో జడ్చర్ల కొత్తబస్టాండు వరకు అబ్దుల్ సత్తార్ వెళ్లాడు. జడ్చర్ల కొత్తబస్టాండులో పది నిమిషాల పాటు బస్సు నిలబడడంతో స్టాండుపై ఉన్న బ్యాగును దామోదర్ తీసుకోగా, బరువులో తేడా వచ్చింది. వెంటనే బ్యాగులో చూసుకోగా, నగదు స్థానంలో నీళ్ల బాటిల్స్ ఉండడంతో నగదు చోరీ అయినట్లుగా గుర్తించి, జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాలు, టెక్నాలజీని ఉపయోగించి నిందితుల వివరాలను సేకరించినట్లు తెలిపారు. నిందితులంతా హైదరాబాద్‌లోని పహడీషరీఫ్‌లో తాత్కాలిక నివాసం ఉండి నగదును చోరీ చేసిన అనంతరం తమ సొంత ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బిజ్నూర్‌కు వెళ్లిపోయారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సైలు శివానందం, అశోక్‌బాబుల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశామని, ఇతర


కేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ జానకి

ప్రాంతాలలో ఉన్న సీసీ కెమెరాలు, టెక్నాలజీని ఉపయోగించి నిందితులను గుర్తించినట్లు తెలిపారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, జడ్చర్ల ఎస్సై శివానందం, కానిస్టేబుల్స్ గోపాల్, మన్సూర్, బాలచంద్రుడు, వెంకటేశ్‌ల బృందం ఉత్తర ప్రదేశ్‌కు వెళ్లి, అక్కడి పోలీసుల సహకారంతో ముగ్గురు నిందితులను ఈ నెల 28న అరెస్ట్ చేశారని, వీరి వద్ద రూ.29లక్షల 25వేల నగదును స్వాధీనం చేసుకున్న అనంతరం అక్కడి లోకల్ కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. వీరంతా హైదరాబాద్‌లోని పహడీ షరీఫ్ ప్రాంతంలో సంఘటనకు 15 రోజుల ముందు వచ్చినట్లుగా తెలిసిందని, షెల్టర్ ఇచ్చిన వారికి రూ.75వేలు ఇచ్చినట్లుగా నిందితులు పేర్కొన్నారని తెలిపారు. చోరీకి పాల్పడిన రూ.36 లక్షలలో రూ.6లక్షలు ఖర్చుపెట్టారని, మిగిలిన డబ్బుతో ప్లాటు కొనేందుకు యత్నిస్తుండగా పట్టుబడ్డారని వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న రూ.29 లక్షల 25వేల నగదు, మూడు సెల్‌ఫోన్‌లను మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసును ఛేదించిన జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సై శివానందం, కానిస్టేబుల్స్ గోపాల్, మన్సూర్, బాలచంద్రుడు, వెంకటేశ్‌లకు రివార్డులు అందచేశారు. సమావేశంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సైలు శివానందం, అశోక్ బాబులున్నారు.

గద్వాల హౌసింగ్ బోర్డులో స్థల వివాదం

- ఖాళీ స్థలాన్ని చదును చేసేందుకు సిద్ధమైన అధికారులు
- అడ్డుకునేందుకు కాలనీవాసుల యత్నం

గద్వాల, జూలై 30 : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఖాళీ స్థలం వివాదాస్పదమయ్యింది. హౌసింగ్‌బోర్డు అధికారులు మంగళవారం ఆ స్థలాన్ని చదును చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. అందుకు కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పనులను అడ్డుకునేందుకు యత్నించారు. ఇది ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన 10 శాతం స్థలమని చెప్పారు. పదిశాతం భూమి ఎక్కడుంది? ఖాళీ స్థలం ఎక్కడుందో తమ దగ్గర పూర్తి సమాచారం అందని అధికారులు వారికి తెలిపారు. ఈ విషయంపై డీఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాము చదును చేస్తున్నది పదిశాతం భూమి కాదని తెలిపారు. అప్పట్లో ఇళ్ల నిర్మాణం చేయకపోవడంతో ఖాళీగా ఉందని తెలిపారు. మిగిలిన స్థలాలను విక్రయించాలని ప్రభుత్వం సూచించడంతో చదును చేస్తున్నామని వివరించారు. కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఆ స్థలాన్ని పరిశీలించామని టౌన్ ప్లానింగ్ అధికారి కళ్యాణచక్రవర్తి తెలిపారు. మరోసారి పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు.

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

- ఇన్‌ఫ్లో 1.60 లక్షలు, ఔట్‌ఫ్లో 1.59 లక్షల క్యూసెక్కులు


సుంకేసుల డ్యాం నుంచి దిగువకు వదిలిన వరద నీరు

రాజోలి, జూలై 30 : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల శివారులోని సుంకేసుల జలాశయానికి వరద పోటెత్తుతోంది. సోమవారం ఎగువ నుంచి 1.52 లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద, మంగళవారం 1.60 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. సుంకేసుల డ్యాం 28 గేట్ల ద్వారా 1.59 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. డ్యాం సామర్థ్యం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం నీరు 289.60 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

కేజీబీవీల్లో విద్యార్థులు ఫుల్.. వసతులు నిల్

- సమస్యల మధ్య చదువులు
- అదేమిటని అడిగితే విద్యార్థులకు బెదిరింపులు
- మెనూ ప్రకారం భోజనం అందించాలి: డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 30 : బడి మానేసిన బాలికలకు ఉజ్వల భవిష్యత్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో నాణ్యమైన భోజనంతోపాటు విద్యా, నైపుణ్య శిక్షణ అందించడంతో ప్రవేశాలకు మంచి ఆదరణ పెరుగుతోంది. బోధన కూడా బాగుండటంతో తమ పిల్లలను చేర్పించేందుకు పైరవీలు చేయించి మరీ విద్యాలయాల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. దీంతో ప్రతీ ఏటా విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. అయితే విద్యార్థినులకు అనుగుణంగా వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు చాలా కేజీబీవీల్లో పని చేయడంలేదు. మిషన్ భగీరథ వాటరే దిక్కు. విద్యార్థినులు ఉదయాన్నే స్నానం కోసం గీజర్స్, వాటర్ హిటర్స్ ఏర్పాటు చేసినా పని చేయడం లేదు . గత రెండు సంవత్సరాలుగా వాటిని పట్టించుకున్న పాపానపోలేదు. కరెంటు పోయిన సమయాల్లో ఇబ్బంది పడకుండా కొన్ని కేజీబీవీల్లో ఇన్వర్టర్స్ కూడా ఏర్పాటు చేసినా అవి కూడా మరమ్మతులకు గురయ్యాయి. ఇన్ని సమస్యలు ఉన్నా కేజీబీవీ నిర్వాహకులు పట్టించుకోవడంలేదు. విద్యార్థినులు తమకు వసతులు కల్పించండని అడిగితే ఎస్‌వోలు, సీఆర్‌టీలు కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీ ఇళ్ల దగ్గర అన్ని ఉన్నాయా ఉంటే ఇక్కడికేందుకొచ్చారంటూ బేదిస్తున్నారని పలు కేజీబీవీల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ జరుగుతున్న విషయాలను కనీసం తల్లిదండ్రులకు కూడా చెప్పకుండా పలు విద్యాలయాల్లో విద్యార్థినులను భయంతో ఉంచారంటే పరిస్థితి ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పాలమూరు జిల్లాలో 15 కేజీబీవీలు

మహబూబ్‌నగర్ జిల్లాలో 15 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 4,366 మంది విద్యార్థినులు చదువుతున్నారు. జిల్లాలో తొమ్మిది కేజీబీవీల్లో ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు కొనసాగుతున్నాయి. ఆరు



మహబూబ్‌నగర్ రూరల్ కేజీబీవీ భవనం

కేజీబీవీలలో ఆరు నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్నాయి. కేజీబీవీల నిర్వహణ కోసం ప్రతీ ఏటా కేంద్రప్రభుత్వం నుంచి 60శాతం , రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 శాతం నిధులు వస్తాయి. విద్యార్థుల వసతితోపాటు మెనూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ , రాత్రి భోజనం ఇవ్వాలని పొందుపరిచారు. కానీ, చాలా కేజీబీవీలలో ఇది అమలుకావడం లేదు. కొన్ని కేజీబీవీలలో అయితే మెనూలో ఉన్న సగం కూడా అమలు కావడం లేదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు అడిగితే మీ పిల్లలు మీతో చెప్పారా...? అని ఎస్‌వోలు చిందులు వేస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. కొన్ని కేజీబీవీల్లో ఎస్‌వోలకు , సీఆర్‌టీలకు మధ్య గొడవలు ఉన్నట్లు సమాచారం. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. నిధులు ఉన్న కేజీబీవీల్లో వసతులు కల్పించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కేజీబీవీలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. కొన్ని కేజీబీవీల్లో మెనూ పాటించడం లేదని తమ దృష్టికి వచ్చింది. ఆ కేజీబీవీలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం. ఒకవేళ నిజమని తెలితే చర్యలు తప్పవు. ఎస్‌వోలతో త్వరలోనే సమావేశం నిర్వహించి విద్యార్థులను ఎవరిని కూడా బెదిరించొద్దని ఆదేశిస్తాం.

- ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

గ్రామీణ ప్రాంతాల్లో

క్రీడలను ప్రోత్సహించాలి

- అసెంబ్లీలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, జూలై 30 : గడిచిన పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నిర్వహణ సరిగ్గా లేక క్రీడాకారులు నిర్లక్ష్యానికి గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం అందించి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రీడలను పోత్రహిం చిందని, బీఆర్ఎస్ పాలనలో క్రీడలను ప్రోత్సహించక క్రీడలలో చిన్నారులు రాణించలేకపోతున్నారని అన్నారు. నారాయణపేట జిల్లాలో రెజ్లింగ్, ఖోఖో క్రీడలలో బాలికలు రాణిస్తున్నారని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఆధునిక హంగులతో కొత్తగా స్టేడియం నిర్మించేందుకు ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం జరిగిందని సభ ద్వారా ధన్యావాదాలు తెలిపారు. అదే విధంగా క్రీడా కోచ్‌లను నియమించాలని, ఖాళీగా ఉన్న క్రీడా పోస్టులను భర్తీ చేయాలన్నారు.


అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న పర్ణికారెడ్డి

డీఎస్సీకి 69 మంది అభ్యర్థులు గైర్హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 30 : డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు 69 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ధర్మపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాల, క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో పరీక్షలు కొనసాగాయి. ధర్మపూర్ జేపీఎన్‌సీఈ కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180మంది అభ్యర్థులకు గాను 165 మంది హాజరుకాగా, 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులకు గాను 165 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 78 మందికి గాను 50 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 184 మంది గాను 173 మంది హాజరుకాగా 11 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 69 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదని సంబంధిత పరీక్షల అధికారులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబ్‌పేట, జూలై 30: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుకను పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్ సిబ్బంది భాస్కర్ మరికొందరు మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట నుంచి లోకిరేవు వెళ్తుండగా పోషమ్మ కుంట అలుగు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ను ఆపి డ్రైవర్‌ను విచారించగా మల్లారెడ్డిపల్లికి చెందిన శివ లింగం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జూలై 30: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి హనుమంత్ (32) అదృశ్యమైనట్లు మంగళవారం అతని భార్య కళావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఏఎస్ఐ సత్యంగౌడ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హనుమంత్, కళావతి ఇద్దరు భార్యభర్తలు జీవనోపాధి కోసం జడ్చర్లలో నివాసం ఉన్నారు. ఈ నెల 21 ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో పని ఉందని చెప్పి వచ్చి నాటి నుంచి కనబడడం లేదని ఫిర్యాదులో తెలిపారు. బంధువుల ఇళ్లలో వాకబు చేసిన సమాచారం లేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని వాపోయారు. యువకుడు తప్పిపోయినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యంగౌడ్ తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తిమృతి

మహబూబ్‌నగర్, జూలై 30: రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. పాత పాలమూరుకు చెందిన రాఘవేందర్(38)ఈనెల 28న మహబూబ్‌నగర్-దివిటిపల్లి మధ్య రైలుకిందపడి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలుకు తీవ్రగాయం కావడంతో కాలును తొలగించి మెరుగైన చికిత్సకోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై సయ్యద్‌అక్బర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎన్‌డీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

- ట్యాంకర్ ఖాళీగా ఉండటంతో తప్పిన పెను ప్రమాదం

బాలానగర్, జూలై 30: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై సీఎన్‌జీ గ్యాస్ ట్యాంకర్ మంగళవారం సాయంత్రం బోల్తా పడింది. ట్యాంకర్ ఖాళీగా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. దాంతో జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్సై తిరుపాజి తమ పోలీసు సిబ్బందితో క్రేన్ సహాయంతో డీసీఎంను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఎంఈవోల బదిలీ

- మహబూబ్‌నగర్ ఎంఈవోగా లక్ష్మణ్‌సింగ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 30 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పలువురు మండల విద్యాశాఖ అధికారులు బదిలీ అయ్యారు . మంగళవారం రాత్రి బదిలీ అయిన ఎంఈవోలకు ఆర్జేడీ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి వరకు ఎనిమిది మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. వారిలో ఐదుగురు పాత రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలను ఎంచుకున్నారు. సీసీ కుంట మండల విద్యాశాఖ అధికారిగా ఉన్న లక్ష్మణ్ సింగ్ మహబూబ్‌నగర్ మండల ఎంఈవోగా బదిలీలు అయ్యారు. గండీడ్ ఎంఈవోగా ఉన్న వెంకటయ్య రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలానికి బదిలీ అయ్యారు. షాద్‌నగర్ ఎంఈవో శంకర్ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు , పాన్‌గల్ మండల ఎంఈవో లక్ష్మణ్ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలానికి, కల్వకుర్తి ఎంఈవో బాసునాయక్ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలానికి, వంగూర్ ఎంఈవో శంకర్ కల్వకుర్తికి, తిమ్మాజీపేట ఎంఈవో శ్రీనివాసులు హిమాయత్‌నగర్ ఎంఈవోగా, బల్మూర్ ఎంఈవో రామరావు రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు బదిలీ అయ్యారు. మొత్తంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎనిమిది మంది ఉంటే ఈ బదిలీలతో ముగ్గురు మాత్రమే మిగిలారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకరు, నాగర్ కర్నూల్ జిల్లాలో ఇద్దరు మాత్రం మిగిలారు. మిగిలిన అన్ని మండలాలకు సీనియర్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జీ ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. వీరికి కూడా ఒకరికి నాలుగు, ఐదు మండలాల ఇన్‌చార్జీలుగా ఉన్నారు.

ఆస్తి వివాదంతో సోదరుడి హత్య

- తెలంగాణ నుంచి ఏపీకి ద్విచక్ర వాహనంపై శవంతో జర్నీ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణ సంఘటన


సోదరుడి శవాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళుతున్న నిందితులు

రాజోలి, జూలై 30 : ఆస్తి తగాదాల కారణంగా సోదరుడిని ఇద్దరు సోదరులు కలిసి హత్య చేసి, శవాన్ని తీసుకొని ద్విచక్ర వాహనంపై జర్నీ చేయడం తెలంగాణ ఏపీ సరిహద్దుల్లో చర్చనీయంశంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన శేషిరెడ్డి అలియాస్ అగ్గిపుల్ల, చిన్న నాగిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి ముగ్గురు అన్నదమ్ముళ్లు. వీరి మధ్య గత సంవత్సరం నుంచి ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈ కారణంగానే శేషిరెడ్డి అలియాస్ అగ్గిపుల్ల (55) అనే వ్యక్తిని ఆయన ఇద్దరు సోదరులు ఆదివారం రాత్రి రాజోలి ప్రాంతంలో ఎవరూ లేని ప్రదేశానికి తీసుకొనిపోయి హత్య చేశారు. సోమవారం తెల్లవారుజామున మృతదేహానికి ముసుగు వేసుకొని రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంలో పాడేసేందుకు ఇద్దరు సోదరులు కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఇక్కడ వద్దని భావించి అడవీ ప్రాంతంలో పాడేసేందుకు ఏపీలోని ముడుమాల, కొత్తకోట గ్రామాలకు తీసుకెళుతుండగా స్థానికులు గమనించారు. నిందితులను ప్రశ్నించడంతో కొత్తకోట వైపు వెళ్లారు. అక్కడ కూడా స్థానికులు ప్రశ్నించడంతో సుంకేసుల రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఎవరూలేనిది చూసి శవాన్ని పాడేసి వెళ్లిపోయారు. ఈ సంఘటనను గమనించిన స్థానికులు ఫొటోలు, వీడియోలు తీసి మంగళవారం సోషల్ మీడియాల్లో వైరల్ చేశారు. గూడూరు పోలీస్ స్టేషన్‌లో మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు గతంలో తన సోదరుడు నాగిరెడ్డిని తలపై కొట్టినట్లు రాజోలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీటీ రోడ్డును మరమ్మతులు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్థులు

జడ్చర్ల, జూలై 30 : జడ్చర్ల మండలంలోని వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డును మరమ్మతు చేయించాలంటూ మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కోసం టిప్పర్‌లతో నల్లమట్టిని తరలించడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందని కలెక్టర్‌కు వివరించారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల ప్రజలు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదండాపూర్ గ్రామానికి చెందిన గౌరిశంకర్ ఈ నెల 28న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, చికిత్స కోసం జడ్చర్లకు తీసుకువస్తుండగా గుంతలమయమైన రోడ్డు కారణంగా సకాలంలో ఆసుపత్రికి రాలేకపోవడంతో మృతిచెందా డని కలెక్టర్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని స్థితిలో రోడ్డు ఉందని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో పాషా, బాలరాజు, నరేందర్, మహేష్‌లతో పాటు గ్రామస్థులున్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

- ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్



మహ్మద్ అద్నానుద్దీన్‌ను సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూలై 30: ప్రతీ క్రీడాకారుడు జాతీయస్థాయికి ఎదగాలని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం కళాశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత నెల నిర్వహించిన ఇండో నేపాల్ భారత్ యూత్ గేమ్స్ అంతర్జాతీయ చాంపియన్ షిప్‌లో క్రికెట్ విభాగంలో పాల్గొన్న కళాశాల విద్యార్థి మహ్మద్ అద్నానుద్దీన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. పీడీ కె.సత్య భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు రాములు, నర్సింహులు, వెంకటేశ్, మధుసూదన్ పాల్గొన్నారు.

ఘనంగా నాభి శిల వార్షిక పూజలు

కోయిలకొండ, జూలై 30: మండల కేంద్రంలో గత సంవత్సరంలో ప్రతిష్ఠించిన నాభిశిల, గ్రామ దేవతల వార్షిక పూజలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అర్చన పూజలను జరిపించారు. అమ్మవార్లను వివిధ పూలతో అలంకరించారు. దీంతో పాటు డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మైసమ్మ దేవత ఊరేగింపు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్య, రాజ్‌కుమార్, నాయకులు రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, జగన్‌గౌడ్, శేఖర్, రామస్వామి, నాగరాజు, రాములు, రమేష్, నాగేష్, శ్రీను, భరత్, నర్సిములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న కేఎల్ఐ నీరు

మిడ్జిల్, జూలై 30: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్‌ల్లో నీరు సమృద్ధిగా చేరడంతో పంప్‌హౌజ్‌ల నుంచి సాగునీరు వదలడంతో మంగళవారం మండల కేంద్రానికి కేఎల్ఐ నీరు వచ్చింది. కేఎల్ఐ నీరు మండలానికి రావడంతో చిలువేరు, అయ్యవారిపల్లి, మున్ననూరు, వాడియాల, మిడ్జిల్, మల్లాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పూజలు చేశారు. కేఎల్ఐ నీరు రావడంతో మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేఎల్ఐ నీరు కాల్వలో పారుతుండటంతో కాల్వ పరిసర ప్రాంతంలో మరింత వరిసాగు పెరిగే అవకాశం ఉందని పలు గ్రామాల రైతులు తెలిపారు.

పాలమూరు అభివృద్ధికి కృషి చేయండి

- ఏపీ జితేందర్‌రెడ్డిని కోరిన హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 30: పాలమూరు అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కృషి చేయాలని, కేంద్రం నుంచి జిల్లాకు రావాల్సిన ప్రాజెక్టులను సాధించాలని టీపీసీసీ అధికారప్రతినిధి జి హర్షవర్ధన్‌రెడ్డి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రతినిధి, మాజీఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఢిల్లీలో ఆయన ఛాంబర్‌లో జితేందర్‌రెడ్డిని కలిసి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి పనుల విషయంలో చర్చించారు. తెలంగాణకు, ముఖ్యంగా వెనకబడ్డ నారాయణపేట జిల్లాకు సైనిక్ స్కూల్ తీసుకువచ్చేందుకు కృషిచేయాలని కోరారు. అదేవిధంగా క్రీడారంగం అభివృద్ధి కోసం నిధులు తీసుకురావాలని, విద్యాభివృద్ధికి కృషిచేయాలని, పాలమూరుకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువచ్చేందుకు కేంద్రంతో ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ

రాజాపూర్, జూలై 30: ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి తమ సేవలను అందించాలని ఎస్పీ డి.జానకి అన్నారు. మంగళవారం మండలంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. డయల్ 100, స్వయంగా బాధితులు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు లకు సకాలంలో స్పందించాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నా టారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామీణ సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై రవి, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, ప్రసాద్, ఆనంద్, కానిస్టేబుళ్లు వెంకట్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్లాట్ బుక్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

గండీడ్ , జూలై 30: అక్రమంగా భూమి పట్టా కోసం స్లాట్ బుక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు దొడ్డె చెన్నయ్య, కుమారుడు నవీన్ కోరారు. తన ఇద్దరి కొడుకులకు దానపత్రం కింద పట్టా చేయాలని స్లాట్ బుక్ చేయడానికి వెళ్లగా ముందే స్లాట్ బుక్ అయినట్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో వెన్నాచేడ్ గ్రామానికి చెందిన రైతు దొడ్డె చెన్నయ్య, కుమారుడు నవీన్ ఆందోళన చెందారు. మంగళవారం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తమ భూమిని అక్రమంగా పట్టా చేసుకోవాలని స్లాట్ బుక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధిత రైతుకు న్యాయం చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు హన్నాబాద్ వెంకటయ్య , రాజు నాయక్ పాల్గొన్నారు.

రుణాల కోసం రైతులు పడిగాపులు..

మిడ్జిల్, జూలై 30: ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేస్తూ డబ్బులను రైతుల ఖాతాలలో జమ చేసిన మళ్లీ రుణాలు పొందేందుకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఓ పక్క సీఎం రేవంత్‌రెడ్డి బ్యాంకులకు వచ్చిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని ఆదేశించినప్పటికీ మిడ్జిల్ మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో మాత్రం అధికారులు స్తబ్ధంగా ఉన్నారు. మండలంలోని వాడియాల, మిడ్జిల్, మున్ననూరు, వేముల, బోయిన్‌పల్లి, కొత్తూరు, మల్లాపూర్, మసిగుండ్లపల్లి గ్రామాల రైతులకు మొదటి విడతకు సంబంధించిన రుణామాఫీ డబ్బులు ఇప్పటికే వచ్చాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన ఆఫీసర్ 12రోజులుగా సెలవుపై వెళ్లడంతో రైతులు నిత్యం బ్యాంకు చుట్టు తిరుగుతున్నారు. మరో 15రోజుల వరకు ఆయా గ్రామాల రైతులకు కొత్త రుణాలను ఇచ్చేందుకు వీలుండదని బ్యాంకు అధికారి చెప్పినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రుణామాఫీ చేసినప్పటికి ఇదేమిటని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై బ్యాంకు మేనేజరు కృష్ణమూర్తిని వివరణ కోరగా తమకు సిబ్బంది లేరని ఆయా గ్రామాలకు సంబంధించిన రుణాలను చూసే అధికారి సెలవుపై వెళ్లడంతో ఇబ్బంది ఏర్పడిందన్నారు.

బాలకార్మికులను తీసుకెళ్లిన ముస్కాన్ బృందం

జడ్చర్ల, జూలై 30 : జడ్చర్ల పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ముస్కాన్ టీం దాడులు నిర్వహించింది. వివిధ ప్రాంతాలలో బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులను అదుపులోకి తీసుకుని బాలకార్మికులను మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. ముస్కాన్ టీంలోని ఎస్సై పరుశురాములు, కానిస్టేబుల్ తిమ్మప్ప, లేబర్ ఆఫీసర్‌తో పాటు బృందంలోని సభ్యులు బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు రాగి జావ

జడ్చర్ల, జూలై 30 : జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవార సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో రాగిజావ, డ్రైఫ్రూట్స్ అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు షాహినాపర్వీన్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, అమరేందర్‌రెడ్డి, ఉమాదేవి, స్లీవారెడ్డి, శశిధర్, అనుసూయ, అబ్దుల్‌బారి, కరుణాకర్, శరణప్ప, గోవర్ధన్, శ్రీనివాస్‌శెట్టి, తాహెర్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుతో వ్యక్తికి గాయాలు

మిడ్జిల్, జూలై 30: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుడికాలుకు కుక్క కాటు వేయడంతో గాయమైనట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. కుక్కకాటుకు గురైన వ్యక్తికి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు శ్రీకాంత్, చెన్నమ్మలు చికిత్స చేసినట్లు తెలిపారు కేవలం ఒక్క జూలై లో 15 మందికిపైగా కుక్కలు కాటు వేసినట్లు తెలుస్తుంది.

కోనో కార్పస్ చెట్ల తొలగింపు షురూ

- బైపాస్‌లో వాటి స్థానంలో పెద్దచెట్లు తీసుకువచ్చే ప్లాన్
- పనులను పరిశీలించిన పుర చైర్మన్, కమిషనర్



బైపాస్‌లో కోనోకార్పస్ చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

మహబూబ్‌నగర్, జూలై 30: శ్వాస కోశ వ్యాధులకు కారణమవుతున్నాయన్న కారణంగా పురపాలి కపరిధిలో పెద్దఎత్తున నాటిన కోనోకార్పస్ జాతి మొక్కల తొలగింపు ప్రక్రియ షురూ అయింది. ముందుగా బైపాస్ రహదారి మధ్యలో నాటిన మొక్కలను మూడ్రోజులుగా ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్నారు. త్వరలోనే వాటి స్థానంలో పెద్ద మొక్కలను తీసుకువచ్చి నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పురపాలిక పరిధిలోని ప్రధాన రహదారులు, బాలుర జూనియర్ కళాశాల మైదానంతోపాటు ఇతర ప్రాంతాలలో ఈ మొక్కలను గతంలో నాటారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన ఏపుగా పెరగడంతో పాటు అందంగా మొక్కలు కనిపిస్తున్నాయి. తక్కువ సమయంలో గుబురుగా ఆకర్శనీయంగా కనిపించే ఈ మొక్కల పుప్పొడి ఆరోగ్యానికి హానికరమన్న ప్రచారం సాగుతుండటంతో ఇటీవల బాలుర జూనియర్ కళాశాల మైదానానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెళ్లిగా వాకర్స్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్య పరిరక్షణకు వాకింగ్‌కు మైదానానికి వస్తున్నామని, ఇక్కడ మైదానం చుట్టూ కోనో కార్పస్ జాతి మొక్కలు ఉండటంతో వాటి వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులు, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే ఆ జాతి మొక్కలను తొలగించి వాటి స్థానంలో పెద్దమొక్కలు తీసుకువచ్చి నాటాలని ఆదేశాలిచ్చారు. దీంతో మొక్కల తొలగింపు బాధ్యతలను పురపాలిక శాఖకు అప్పగించారు. ఇందుకోసం అనుమతులు తీసుకున్న అధికారులు బైపాస్ రహదారిలో చెట్ల తొలగింపు ప్రక్రియను ప్రారంభించగా, మంగళవారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బైపాస్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో త్వరలోనే ఈ జాతి మొక్కలను తొలగించి ఆరోగ్యకర మైన మొక్కలను నాటుతామని చెప్పారు.

ప్రతీ రోజు పాఠశాలలను పర్యవేక్షించాలి

- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పకడ్బందీగా నిర్వహించాలి
- డీఈవో ఎ. రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 30 : ప్రతీరోజు ఒక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , మండల నోడల్ అధికారులు పర్యవేక్షించాలని డీఈవో ఎ.రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఎన్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బుధవారం నుంచి ప్రారంభమయ్యే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతీ పాఠశాలలో న్యూట్రి గార్డెన్స్ పెంచాలని సూచించారు. నిమ్మ, కరివేపాకు, మునగ మొక్కలు విరివిగా పెంచేలా చూడాలన్నారు. తమ పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు భవిత కేంద్రాలను కూడా పర్యవేక్షించాలన్నారు. విద్యాంజలి పోర్టల్‌లో ఎక్కువ సంఖ్యలో వలంటీర్లు రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీనెల తల్లిదండ్రుల సమావేశాలు పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఎంవో బైకాని బాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎఫ్ఏవో యాదగిరి, సమగ్రశిక్ష అధికారులు శ్రీనివాస్, సంపత్, సైన్స్ అధికారి శ్రీనివాస్ , అన్ని మండలాల ఎంఈవోలు, నోడల్ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ప్రతీ పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్ సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 15 లోగా ప్రతీ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఐదు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో హంగూ ఆర్భాటాలే

- కాంగ్రెస్ రైతుపక్ష పాతి
- తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న ఒబేదుల్లా

మహ బూబ్‌నగర్, జూలై 30: బీఆర్ఎస్ పాలన హంగూ ఆర్భాటాలకే తప్పా ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్ అన్నారు. పదేళ్ల పాలన మాటలకే పరిమితమైందని, తెలంగాణ ప్రజలపై రూ. ఏడులక్షల కోట్ల అప్పుమోపిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే రైతురుణమాఫీ చేసి రైతు పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నద న్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నార న్నారు. రైతుల రూ. రెండులక్షల రుణమాఫీని చిత్తశుద్ధితో చేస్తున్నారని, రైతులంతా ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. సీఎం ఇటీవల ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికోసం దృష్టి పెట్టారన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధితోపాటు స్కిల్‌డెవలప్‌మెంట్‌లు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. వ్యవసాయరంగం బలోపేతనం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, బడ్జెట్‌లో ఎంఎస్‌పీ ప్రకటించడం హర్షనీయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే అమలుచేసి తీరుతుందని, ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలుచేసి తీరుతుందన్నారు. ఇప్పటికే చాలా వరకు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. సమావేశంలో నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, బెక్కరి అనిత, గంజి ఆంజనేయులు, జాకీర్, బాలస్వామి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూలై 30 : బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టుకాడి శ్రీనివాసులుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ అంటూ పలు హామీలు ఇచ్చారన్నారు. కానీ, బీసీ డిక్లరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన బడ్జెట్‌కు ఎలాంటి పొంతన లేదని మండిపడ్డారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 50శాతం కన్నా అధికం ఉన్నప్పటికీ బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కంటితుడుపుగా నిధులు కేటాయించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బడ్జెట్‌లో బీసీ డిక్లరేషన్ అమలుకు రూ. 50వేల కోట్లు కేటాయించి ఖర్చుచేయాలని విజ్ఞప్తి చేశారు. 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు ప్రత్యక్ష సంక్షేమ మంత్రిత్వ శాఖతో పాటు అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్యసంఘాలకు చేపపిల్లలను పంపిణీ చేయకుండా బిడ్లు ఆహ్వానించడం అవినీతికి తెరలేపడమేనని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వారు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో శంకర్‌కు వినతిని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు పద్మజారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, పోతుల రాజేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యామ్ బాబ్లేకర్, ఉపాధ్యక్షులు రాజేష్ కమలేకర్, మడుగు శంకర్, మహేశ్, మండల అధ్యక్షులు బాలగోపి, రాజు, శ్రీను, కిన్నెర యాదయ్య, దాసు, ముట్లుకాడి శ్యాం, మీడియా ఇన్‌చార్జి కోస్గి సతీష్, ఆఫీస్‌ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

' ఆశ, పంచాయతీ కార్మికుల అరెస్టు సరికాదు'

పాలమూరు,జూలై30 : ఆశ, పంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయటం సరికాదని సీఐటీయూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశ, గ్రామపంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20రోజుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతితోనే ఆశ, పంచాయతీ కార్మికులు ఆందోళన చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు కార్మికులు వెళ్లకుండా బస్సులను తనిఖీ చేయటం, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్కీములన్నింటిని ప్రైవేటీకరించడానికి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ అడుగులోనే కాంగ్రెస్ నడుస్తోంద న్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్, జ్యోతి, కమల, రాధ, నర్సమ్మ, యాదమ్మ, పద్మ, ఎర్రం నరసింహులు, వెంకట్రావు, విశ్వనాథం, చెన్నయ్యలు పాల్గొన్నారు.

వచ్చేనెల 8 నుంచి మాలల మహాధర్నా

పాలమూరు, జూలై 30 : వచ్చేనెల 8,9,10వ తేదీల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో వాల్‌పోస్టర్, కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్గీకరణతో దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ బిల్లును మాలమహానాడు ఆధ్వర్యంలో అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాడం బాలరాజు, ఎడ్ల కృష్ణయ్య, డబ్బా రాములు, బ్యాగరి శ్రీనివాసులు, గోకం చెన్నయ్య, ఎం.వెంకట్రాములు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకులకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి బి. రాజు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, జూలై 30 : ఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీఏ మూడో సంవత్సరం చదువుతున్న బి.రాజు పాలమూరు యూనివర్సిటీ తరుపున ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మావతి, ఎన్ఎస్ఎస్ అధికారి రాఘవేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజును కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, అధ్యాపకులు ఈశ్వరయ్య, సత్యభాస్కర్, నర్సిములు, మధుసూదన్ అభినందించారు.

త్రీడేస్ టోర్నీలో జిల్లా జట్టు జోరు

- తొలిరోజు జిల్లా బౌలర్ల హవా

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్,జూలై 30: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ త్రీడేస్ లీగ్ టోర్నీలో రెండో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు జోరు కొనసాగుతోంది. మంగళవారం మహబూబ్‌నగర్, హైదరాబాద్ బ్లూస్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ బ్లూస్ జట్టు 20.3 ఓవర్లలో 51 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. జిల్లా బౌలర్లలో అరుణ్ 3, జయసింహ, గణేష్ చేరో వికెట్ తీసి రాణించారు. జిల్లా జట్టు క్రీడాకారులు రాణించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ జట్టు క్రీడాకారులను అభినందించారు. రెండో మ్యాచ్ విజయం సాధించాలని ఆకాక్షించారు.

భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

మహమ్మదాబాద్ జూలై 30 : మండలంలో భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వికారాబాద్ జిల్లా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలామారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ - చించోలి ఎన్‌హెచ్ 167 రోడ్డు విస్తరణ పనుల కోసం మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని పైప్‌లైన్ షిఫ్ట్ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 22 గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని, ప్రజలు గమనించాలని కోరారు.

మహిళా మత్స్యకారుల సంఘాలు పెరగాలి

పాలమూరు, జూలై30: మహబూబ్‌నగర్ జిల్లాలో మత్స్యసహకార సంఘాల్లో మహిళల సంఖ్య పెరగాలని మత్స్యశాఖ జిల్లా అధికారి యం.చరిత అన్నారు. మత్స్యశాఖాధికారిగా నల్గొండ నుంచి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. మంగళవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లాలో 201పురుషులు(11,411మత్స్యకారులు), 20మహిళా(779మత్స్యకారిణిలు)మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. పురుషులతో పోలిస్తే మహిళా సభ్యుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు పని చేస్తున్నప్పటికీ సభ్యులు పెరగాల్సి ఉందన్నారు. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, చెరువులు, కుంటల్లోకి నీరు చేరిన వెంటనే ఉచిత చేపపిల్లలను వదిలేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే వందశాతం సబ్సిడీపై చేప విత్తనాల పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో 1.9కోట్ల చేప విత్తనాల పంపిణీ లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆమె తెలిపారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



కొత్తగంజ్‌లో పోశమ్మ అమ్మవారు



మహబూబ్‌నగర్ కొత్తగంజ్ పోశమ్మ దేవాలయం వద్ద భక్తుల రద్దీ

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 30: పట్టణంలో ఆషాఢమాసం చివరి మంగళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొత్తగంజ్ పోశమ్మ దేవాలయం భక్తులతో కళకళలాడాయి. ప్రతీ ఆషాఢ మాసంలో గ్రామ దేవత అయిన పోశమ్మ దేవతను భక్తులు మొక్కులు చెల్లిస్తారు. భక్తులు తమ మొక్కుబడులు చెల్లించేందుకు అమ్మ వారి దేవాలయం చుట్టు ప్రదర్శనలు చేసి నైవేద్యం సమర్పించుకున్నారు. కొత్తగంజ్ పోశమ్మ దేవాలయంలో పాటు పలుదేవాలయాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. వేడుకలలో కొత్తగంజ్ వాసులతో పాటు పలుకాలనీలకు చెందిన వారు పాల్గొని అమ్మ వారికి మొక్కులు చెల్లించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో పాటు పలువురు అమ్మ వారి భక్తితో పూజలు నిర్వహించారు.



పెద్దదర్పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు

హన్వాడ మండలంలో

హన్వాడ: మండలంలోని హన్వాడ, పెద్దదర్పల్లి గ్రామాలలో మంగళవారం ఆషాఢమాస బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా మహిళలు బోనాలను కుంకుమ, పసుపు, వేప కొమ్మలతో అలంకరించి ఊరేగింపుగా గ్రామ దేవత ఆలయానికి చేరుకొని ప్రదక్షణలు చేశారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. చల్లంగా చూడు తల్లి, వర్షాలు సమవృద్ధిగా కురిపించి మంచిగా పంటలు పండేలా చూడు తల్లి అని వేడుకున్నారు. వర్షంలోనే మహిళలు బోనాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేవరకద్ర మండలంలో..

దేవరకద్ర: మండల పరిధిలోని పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, నాగన్నపల్లి, మినోపల్లి పేరూర్ గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. అమ్మవారికి అర్చకులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామాల్లోని ప్రజలు పోచ్చమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు బోనం కుండలను తలపై పెట్టుకొని డప్పు చప్పులతో పోతురాజుల విన్యాసాలతో ఆలయానికి చేరుకొని ప్రదక్షణలు చేసి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ నాగన్న బందోబస్తు ఏర్పాటు చేశారు.